# ఆమంచర్ల గోపాలరావు రూపకాలు - విశ్వాంతర

స్వర్గీయ ఆమంచర్ల గోపాలరావు ప్రతిభావంతులైన ఆధునిక నాటకకర్తలలో ఒకరు. గోపాలరావుగారు కేవలం నాటకకర్త మాత్రమే కాదు; చిత్రలేఖకుడు కూడా. చిత్రలేఖనం మీద సాధికారమైన విమర్శలు వ్రాశాడు. బౌద్ధ మతాన్ని గురించి గ్రంథాలు చదివాడు. అజంతా, ఎల్లోరా శిల్పాల మీద వ్యాసాలు ప్రచురించాడు. రాజకీయాల్లో చేరి జైలుకు వెళ్లివచ్చాడు. అది సాహిత్యవ్యాసంగమైనా, రాజకీయ వ్యాసంగమైనా - నిర్దిష్టమైన దీక్షతో చేపట్టి, కృతకృత్యులైన బహుకొద్దిమందిలో ఆమంచర్ల ఒకరు.

ఆయన వ్రాసిన రూపకాలు విస్తృతిలో బహుకొద్ది. ఇవి నాలుగు మాత్రమే - మాటపట్టింపు, మల్లమదేవి ఉసురు, హిరణ్యకశిపుడు, విశ్వాంతర. ఈ నాల్గింటిని గమనిస్తే - ఇందులో రెండు నాటికలు - మాటపట్టింపు, మల్లమదేవి ఉసురు. మిగిలిన రెండూ నాటకాలు. కథావస్తువు దృష్ట్యా నాటికలలో మాటపట్టింపు, నాటకాలలో హిరణ్యకశిపుడు పౌరాణిక సంబంధమైనవి. మిగిలిన రెండూ చారిత్రకాలు. పై విశ్లేషణలవల్ల - నాటక రచనలో కూడా ఆమంచర్ల ముందు పౌరాణిక గాథల్ని నాటకీకరించడంలో ఆ కథలకు ఒక వినూత్నమైన వ్యాఖ్యానాన్ని చేశాడు. ఆ తరువాత చారిత్రక గాథల్ని స్వీకరించి, నిరంతర పరిశోధనలవల్ల తేలిన అంశాలకు నాటకత్వం ఆపాదించి కొన్ని ఆదర్శాలను ''చారిత్రక వాస్తవిక'' దృష్టితో చూపాడని విదితం అవుతున్నది.

''మాట పట్టింపు'' ఏకాంక రూపిక. (ఏకాంకిక అన్నా, రూపిక అన్నా చాలు) ఇది నవ్యసాహిత్య పరిషత్తువారి ''ప్రతిభ'' పత్రికలో ప్రథమంగా ప్రచురితం.

ఈకథ గయోపాఖ్యానానికి సంక్షిప్త వచనరూపం. 'మాటపట్టింపు' అన్నపేరు చూస్తే ఇది సాంఘికమైన లేదా కుటుంబ జీవితానికి సంబంధించిన కథ అని తోస్తుంది. నిజానికి కథ, పాత్రలు పౌరాణికములే అయినా, దీనిలో వర్తమాన సాంఘిక జీవితానికి సంబంధించిన ప్రస్తావన వుంది. మాటలో పట్టింపుకన్న, చేతలలో పట్టింపు ప్రభావంగా ఈకథ నడిచింది. గయుడికి శరణు యిచ్చిన అర్జునుడు, అంతకన్న ఎక్కువగా భీముడు-గయుణ్ణి కృష్ణుడికి అప్పచెప్పడానికి నిరాకరిస్తారు. కృష్ణునితో బలరాముడు కూడా అడవులలోని పాండవులవద్దకు వస్తాడు. బలరాముడు బలవంతాన పాండవుల కుటీరంలోనికి ప్రవేశించి గయుణ్ణి పట్టుకోవాలని ప్రయత్నిస్తాడు. భీముడు కుటీరం వాకిట అడ్డునిలుస్తాడు. బలరాముడు కత్తితీసి భీముని మీదకు విసరబోతాడు. ఇంతలో కుంతి కొడుకుకు అడ్డువచ్చి నిలుస్తుంది. అదే అదనుగా, పాండవులందరూ తమ తల్లిపై కత్తి విసురుతావా అని బలరాముణ్ణే మందలిస్తారు. బలరాముడు చేసిన తప్పుకు కృష్ణుడు కుంతి కాళ్ళపైపడి క్షమించవలసిందిగా వేడుకుంటాడు. నువ్వు గయుణ్ణే క్షమించు, నేను మిమ్ము క్షమిస్తాను అంటుంది కుంతి. ఇంతలో గయుడు కూడా వచ్చి ''అపరాధిని, క్షమించ''మంటాడు. అంతా శుభంగా ముగుస్తుంది.

చివరకు ''పొరపాట్లు క్షమించాల్సిందేలే'' అంటాడు కృష్ణుడు. ఇంతలో అక్కడకు వచ్చిన నారదుడు కూడా గోపాలుని కీర్తిని గానం చేస్తూ

జయ జయ గోకుల బాల

దేవముయా చరిత మిదం

దీనధియా అపరాధం

అంటూ తెలియక తప్పుచేసిన వాళ్ళను క్షమించడంలో ఔదార్యం ఉన్నది - అన్న యీ నాటికలో చూపబడిన నీతిని స్తుతిస్తాడు.

ఇందులోని పాత్ర చిత్రణం అంతా అనుశ్రుతంగా వస్తున్నదే! భీమునిలో వుండే పట్టుదల, తొందరపాటు, ధర్మరాజులో అనిశ్చితత్వం, ప్రతిపనీ తూచి తూచి చేయడం. కుంతికి పిల్లలందరి ఎడవున్న ఆదరం యివి అన్నీ - కొంచెం పరిధిలోకూడా వివరంగా చూపాడు రచయిత. గయునిపాత్ర కొంత అనుదాత్తంగా వున్నట్లు తోచక మానదు. అతని రాకను కుంతి, ధర్మారాజు వర్ణించడం, అతడు వణికిపోతూ తమ దగ్గరకు వచ్చి శరణుకోరడం - ఇవి అతన్ని వట్టి పిరికిపందగా చూపుతాయి. రచయితే అంటాడు: ''అతను కుందేలును కొంచెం జ్ఞప్తికి తెస్తాడు''- అని. అయితే యీరకమైన పాత్ర చిత్రణ భీముడు అతనితో పరియాచకాలాడి అట్టహాసంగా నవ్వి, వీపుమీద చరచడం, అతడు క్రిందకు తూలడం యివి అన్నీ నాటక ప్రదర్శనలో రక్తికట్టగల ఘట్టాలు.

మొత్తంమీద యీ నాటక రచయిత ప్రథమ ప్రయత్నమైనా, కొంత కొత్త విషయం, కొత్తగా చెప్పాలన్న ప్రయత్నం కనిపిస్తుంది. కథలో చూపిన కొత్తదనంకన్న భాషలో చూపిన సరళత, తెలుగు నుడికారం చక్కగా వున్నాయి. వ్యవహారికంలో పౌరాణిక నాటకాలు వ్రాయడం యింకా ప్రాథమిక దశలో ఉన్నరోజుల్లో యీ సాహసాన్ని చేసిన ఆమంచర్ల ప్రశంసనీయుడు.

''స్వాతంత్ర్యోద్యమంలో ఆంధ్ర చారిత్రక సంప్రదాయానికి తగినంత స్థానం ఇవ్వబడలేదన్న కొరతను తీర్చడానికి వ్రాయబడిన నాటిక మల్లమదేవి ఉసురు'' అని శ్రీ కూర్మా వేణుగోపాలస్వామి గారు అభిప్రాయ పడ్డారు. ఇది బొబ్బిలి, విజయనగర రాజులమధ్య ఉన్న శత్రుత్వాన్ని, దానికి పరాకాష్ఠగా జరిగిన బొబ్బిలియుద్ధాన్ని కొత్త దృక్పథంలో చూపే నాటిక. విజయరామరాజు మరణానికి కారణం బొబ్బిలి జ్వాలలు కాదు; మల్లమదేవి ఉసురు అనీ, ఆ ఉసురు కొట్టడం వలననే పాపారావు ద్వారా యీ ప్రతీకారం జరిగిందనీ ఒక కొత్త వ్యాఖ్యానం చేశారు రచయిత. వీణ పత్రికలో ప్రప్రథమంగా 1938లో ప్రచురించబడ్డది ఇది.

ఈ నాటికలో రచయిత కూర్చిన వాతావరణం ప్రశస్తనీయం. మల్లమదేవి మంచాన్ని తెచ్చి, దానిమీద పడుకుంటానని ప్రతినపట్టిన విజయరామరాజును అందరూ వారిస్తారు. బుస్సీ, హైదర్, వెంకన్న - అందరూ. బుస్సీ అంటాడు: ''దీనిని నేను ముట్టుకోను. వెంకన్న అన్నట్లు మల్లమదేవి ఉసురు తగలవచ్చు.'' ఈ మంచం యొక్క పనితనం, అది మల్లమదేవికి చెందివుండడం, ఆమె పతివ్రత కావడం - యివి అన్నీ పాత్రలందరిచేత తిరిగి తిరిగి ప్రస్తావించబడడం వల్ల విజయరామరాజు మరణానికి, యీ మంచానికి గల సంబంధం ఎలా పరిణమిస్తుందోనన్న ఉత్సుకత ప్రతివారిలోను కలుగుతుంది.

దీనికితోడు యిందులో ప్రవేశపెట్టబడిన 'సాని' పాత్ర యీ వాతావరణ నిర్మాణానికి ఎంతో దోహదం చేసి, పరోక్షంగా బొబ్బిలిలోని ప్రతి నలుసూ బెబ్బులేనని చాటుతుంది.

తనవారందరూ మరణించాక పట్టుబడి విజయరామరాజుకు చిక్కుతుంది సాని. ఆ రాత్రి ఆమె పాటను, ఆటను తిలకించి మజా చేసుకోవాలని హైదర్ ఆరాటం.

''తోడివాళ్ళందరూ ఈ సమయంలో వీరస్వర్గంలో నృత్యాలు సల్పుతుంటారు. కాని, నా అదృష్టం ఇలా పండింది. బ్రతికాను. బానిసనయ్యాను.'' అని ఏడుస్తుంది ఆమె.

హైదర్ ఆమెతో కలిసి ఆడతానంటాడు. ''నేనాడను, పాడను, నా నాట్యం వక్కటే! అది ప్రళయనాట్యం'' అనగానే హైదర్ బెదిరిస్తాడు ఆమెను.

''ఏమిటి? నన్ను బెదిరిస్తున్నావా! నాది బొబ్బిలి!'' అని నిర్భయంగా చెప్పి చివరకు గుడారం వెలుపల ఒక సిపాయి బాకు తీసుకొని పొడుచుకొని చచ్చిపోతుంది.

పాపారావుపాత్ర చరిత్ర మనం ఎప్పుడూ వింటున్నదే! ఆయన శౌర్యం యిక్కడా మనకు కనిపిస్తుంది. కాని ఆయనలోని క్షమాగుణం అంతకన్న విస్పష్టంగా గోచరిస్తుంది మనకు. విజయరామరాజును చంపగానే బొబ్బిలి జ్వాలలు అణిగిపోతాయి. కాని ''వీడు హతమైనాడు. బొబ్బిలి సజీవం కాలేదు'' అని విచారిస్తాడు పాపారావు. అంతేకాదు. గంగన్న, తనకు అనుజ్ఞయిస్తే, అలిసి సొలసి పడివున్న సైనికులనందరినీ చిత్రవధ చేస్తానంటే ''వద్దు, గంగన్నా, వద్దు. అది రాక్షసకృత్యం. దండులోని సైనికులు చేసిన పాపమేమి? జీతాలకు లోబడిన బానిసలు....'' అంటాడు పాపారావు. అంతటి విచక్షణా శీలుడు.

ఈ క్షమాగుణంతోపాటు శౌర్యం ఎక్కడ వున్నా, దానిని అభినందించడం పాపారావుకే తెలుసు. ''వీరవెలమలతో సరితూగగల వెరపులేని జీవిని తనలో చూచాను'' అని బుస్సీని గురించి, ''నీలో ఇంతమాత్రపు శౌర్యబీజం ఉందని నేననుకోలేదు'' అని హైదర్‌ను గురించీ పాపారావు అన్నమాటలు యీ విషయాన్నే ద్యోతకం చేస్తాయి.

''మల్లమదేవి ఉసురు'' అన్నపేరు కొంత తరతరాలునుంచి వస్తున్న పాతధోరణులను నమ్మకాలను జ్ఞప్తికి తెస్తున్నా కథానిర్వహణలో చూపిన నేర్పుతోను, వాతావరణ సృష్టిలో చూపిన అతి వాస్తవికతతోను యీ నాటిక వ్యాఖ్యానాత్మక నాటకాలు వ్రాయడానికి పూనుకొన్న రచయిత శిష్యత్వదశను సూచిస్తున్నది. ఈ అనుభవంలో ఎదిగి హిరణ్యకశిపుడుతో పౌరాణిక గాథ ద్వారాను, 'విశ్వంతర'తో చారిత్రక గాథ ద్వారాను వినూత్న వ్యాఖ్యానాలను చదువరుల దృష్టికి తీసుకొని వచ్చాడు ఆమంచర్ల.

పురాణగాథలకు పరంపరానుగతంగా వస్తున్న అర్థాలను త్రోసిరాజని, వానికి క్రొత్త అర్థాలను, వ్యాఖ్యానాలను రూపొందించడం తెలుగుదేశంలో త్రిపురనేని రామస్వామి చౌదరిగారితో బయలుదేరింది. దీనికి చలం విశేషంగా ఊతనిచ్చినవాడు. ఆమంచర్ల ఆ పద్ధతిలో వ్రాసిన నాటకం ''హిరణ్యకశిపుడు.'' ఇట్టి వ్యాఖ్యానాలు అన్నీ ఆధునిక శాస్త్రయుగంలోని నూతన సిద్ధాంతాల కనుగుణంగా వచ్చినవి. దేవుడు, మతం - యివి అన్నీ స్వార్థపరులు

మాయికుని మోసపుచ్చడానికి సృష్టించినవన్నది డార్విన్ సిద్ధాంత ప్రతిపాదనం తరువాత బయలుదేరిన ఒక సిద్ధాంతం. దీనికితోడు మతం పేరిట అధికారులు చేస్తున్న దుండగాలు పెచ్చు పెరిగాయి. ఇట్టివానిని ఖండించడం బెర్నార్డ్ షా విచ్చలవిడిగా తన నాటకాలలో చేశాడు. షా పాత్రచిత్రణ, సంభాషణలలోని పదును అమంచర్ల పుణికిపుచ్చుకొన్నాడనిపిస్తుంది. ముఖ్యంగా షా వ్రాసిన 'సెంట్‌జోన్'కు 'హిరణ్యకశిపుడు'కు దగ్గరి సంబంధం కనిపిస్తుంది. రెంటిలోను మతం ప్రధాన సమస్య. జోన్ చెప్పిన కొత్తసత్యం మతాధికారులకు నచ్చలేదు. అలానే హిరణ్యకశిపుడు చెప్పిన మాటలు కూడా. మతాధికారులు అందరూ కలిసి జోన్‌ను చంపడానికి ఎలాంటి యుక్తులు పన్నారో, హిరణ్యకశిపుని చంపడానికి శుక్రాచార్యాదులు కూడా ప్రహ్లాదుని తండ్రికి వ్యతిరేకంగా తయారుచేయడంతోపాటు అనేకములైన దుశ్చర్యలు చేశారు.

అన్నిటికన్న ముఖ్యమైన సామ్యం మరొకటి ఉన్నది. సెంట్‌జోన్ నాటకం చివర ఒక 'ఉత్తర రంగం' ఉంది. అందులో జోన్ ఒక మతాధికారికి కలలో కనిపిస్తుంది - ఇరవయ్యో శతాబ్దంలో - తాను చెప్పిన మాటలన్నీ యీనాడు నిజమౌతున్నాయా లేదా అని జోన్ ప్రశ్నిస్తుంది. అవునంటాడు. అలానే ఈ నాటకంలో కూడా మతాధికారి అయిన శుక్రాచార్యునికి హిరణ్యకశిపుడు - ''ఇంత మొనతేలిన గడ్డము, బట్టతల. 20వ శతాబ్దపు ఐరోపాయుడుపులతో నొక పొట్టి వ్యక్తి'' రూపంలో కనిపించాడు '' ఆచార్యా! ఇది కలియుగము. నా విప్లవమిప్పటికి జయించినది....'' అంటూ ''దైవమును, మతమును నమ్ముటకు మతిహీనులుండుటకు కృతయుగముకాదు. ఇది సత్యాసత్యముల గుర్తెరింగిన కలియుగము'' అని కలియుగ ప్రభావాన్ని చాటిచెబుతాడు. ఇది ప్రజాక్షేమమునకు సర్వతోముఖమగు మానవాభ్యుదయమునకు దారితీయు నవయుగమట! బానిసత్వమునకు స్వస్తిచెప్పిన యుగమిది. అవివేకాంధకార మంతరించినది. కండ్లు తెరువుము'' అనిచెప్పి నిష్క్రమిస్తాడు.

దాని తరువాత మరొక చిన్నరంగంలో హిరణ్యకశిపునకు ''ధ్వనికి'' జరిగిన సంభాషణలో ధ్వని హిరణ్యుని ''నీవు మహాపురుషుడవు. జయించితివి'' అని ప్రశంసిస్తూనే, ''దైవమును రూపుమాపితివి కాని మతమును మాత్రము నిర్మూలింపజాల వైతివి....'' ''సత్యసమ్మతమగు వేరొక మతమును సృష్టించితివి'' అంటుంది. ఈ ధ్వనే నాటకం ఆదిలో హిరణ్యకశిపుడు చేయచూస్తున్న విప్లవం యెడ వచ్చే ఆపదలను గురించి అతనికి నచ్చచెబుతుంది. ఇది ఆకాశవాణి వంటిది. లేదా అతని అంతరాంతరాలలోని ఆలోచన కావచ్చు. ధ్వని ఎన్ని అభ్యంతరాలను చెప్పినా హిరణ్యకశిపుడు ''ధర్మము నిర్వహించవలెను, విధి తప్పదు'' అనడం వల్ల అతని నిశ్చితమైన మనస్సును గమనించి ''హిరణ్యకశిపా! నీవు మహాపురుషుడవు. నీ అనంతరమున నయిన, కాదా యుగాంతరమున నయిన యిట్టి దురాశా పీడులగు నీచుల సయితము జయించగలవు. విజయోస్తు!'' అని ఆశీర్వదించి పంపుతుంది. దానికి ప్రతిఫలంగానే నాటకం చివరలో తుట్టతుదకు ధ్వని చేత తిరిగి ఆ ప్రశంసా వాక్యాలు వినిపించాడు రచయిత.

ఈ నాటకం మొదట చిత్రగుప్తలో నాలుగు నెలలపాటు ప్రచురించబడ్డది.

మొదటి రెండురంగాలలో హిరణ్యకశిపుడు ఒక నూతన విప్లవాన్ని జరపడానికి యజ్ఞయాగాది క్రతువులను నిషేధించవలసిందిగా ఆజ్ఞ యివ్వడం, మతాచారాలను నిర్మూలనం చేయడం చూపబడ్డది. ''మతమనునది నేనున్న

లోకమున యింక కష్టము, పాపము, వంచనము, హింస మొదలగు ఘోరారిష్టముల కునికియే యుండదు.'' అందువల్ల మతమును నిర్మూలించి దైవవిధ్వంసనం చేయవలసిందిగా ఆజ్ఞ ఇస్తాడు.

మూడునుంచి ఆరు రంగాల వరకు రుషులు, శుక్రాచార్యులు కలిసి హిరణ్యకశిపుని చంపడానికి పన్నాగాలు పన్నడం, సేనానిని, మంత్రినికూడా వశపరచుకోవడం చూపబడ్డది. ఏడవరంగంలో ఈ సమాలోచనలకు పరాకాష్ఠగా నారదుడు లీలావతీ ప్రహ్లాదుల వద్దకు వచ్చి '' ఈ విపత్తు నివారించుట కొక్కటియే దారి. అది నీవల్లను నీ తల్లివలనను'' మాత్రమే జరుగగలదని ఉద్బోధించి చివరకు

''ప్రహ్లాదా! నీవు భాగవత శిరోమణివి... నీవు నీ శక్తిచే నీ తండ్రిని దైవద్రోహనిరతి నుంచి తప్పించి భగవత్ భక్తుని చేయసమర్థుడవు. నీవది చేసిన నీ తండ్రి చావు తప్పును.''

అని ప్రహ్లాదునికి,

''తల్లీ! నీవు మహా పతివ్రతవు. నీపతనిని తన సంకల్పమునుండి మరల్చుము'' అని లీలావతికి బోధిస్తాడు.

వీనిని నమ్మి వారిద్దరూ హిరణ్యకశిపునికి తన చేతలను విరమించవలసిందని నచ్చచెప్పుతారు. అతడు వినడు. తుదకు శుక్రాచార్యుల వారి వలన దైవనిందకుగాను తన తండ్రికి మరణం తప్పదని విన్న ప్రహ్లాదుడు తండ్రితో తిరిగి ప్రసంగిస్తాడు. హిరణ్యకశిపుడు ప్రహ్లాదునికి భగవంతుడు లేడని, అతడు తన్ను చంపడం వట్టిదని చెబుతున్న తరుణంలో ''సరిగా ఈ సమయమునకు హంతకుడు సింహవక్త్రముతో బాకుతో స్తంభము మాటునకు మెల్లమెల్లగ వచ్చి దాగికొనును.''

హిరణ్యకశిపుడు కొడుకునకు తన విప్లవంలోని అంతర్యాన్ని గురించి నచ్చచెపుతాడు :

''దైవమతములు మానవుని వ్యర్థభారములు. ధర్మము, ప్రేమ, దయ, ఇవి కలిగిన విశ్వశాంతికి చాలును'' అయినా ప్రహ్లాదుడు దేవుణ్ణి నిందించవద్దు అంటాడు. ప్రహ్లాదుని భయమంతా - దేవుణి నిందిస్తే తన తండ్రి మరణిస్తాడేమోనని. 'దేవుడన్న నీకంత నమ్మకమా?' అన్న తండ్రి మాటకు 'పూర్తిగా' అని సమాధానం చెబుతాడు, ప్రహ్లాదుడు. అయితే యీ స్తంభంలో చూపమంటాడు. ఇక్కడ రచయిత యిచ్చిన నాటకీయ సూచన చూడండి:

(నవ్వుచు ప్రహ్లాదుని వంక జూచును. ఇంతలో హఠాత్తుగ హంతకుడు హిరణ్యకశిపుని వెనుకనుండి లంఘించి బాకుతో డొక్కలో పొడిచి పలాయితుడగును. తటాలున ప్రత్యక్షమయిన నరసింహ రూపము కంట బడినంత ప్రహ్లాదుడు కండ్లు మూసికొని మ్రాన్పడును.)

అప్పుడు తండ్రిని చూచి ప్రహ్లాదుడు ''అయ్యో! భగవంతుడు మిమ్ములను సంహరించెనా?'' అని వాపోతూవుంటే- ''ఇంకను దేవుడా! మూఢుడా! అదియంతయు గురువుల ఘోరకృత్యము'' అని కుమారుని తూలనాడుతాడు. చనిపోతూ కూడా ''కల్పితదైవ భావన వీడుము. మతమును కలనైన స్మరింపకుము. ఇవన్నియు అసత్యములు'' అంటాడు. ఇది అంతా పదవరంగంలో. తరువాతిది, చివరిది అయిన రంగంలో రుషులందరూచేరి తమ్ముతాము అభినందించుకొని ''మతమునకు గండము తప్పినది'' అని నిట్టూరుస్తారు.

తరువాత వచ్చే రెండు చిన్న ఉత్తర రంగాలలో హిరణ్యకశిపుడు మరణానంతరం ఇరవయ్యో శతాబ్దంలో శుక్రాచార్యుల వారికి కనిపించి తన విష్లవం యీనాటికి విజయవంతమైనదని చెపుతాడు. తరువాత దానిలో 'ధ్వని' హిరణ్యకశిపుని అభినందిస్తుంది. ''క్రాంతికి జయము'' అను శబ్దము మారుమ్రోగుతూ వుండగా తెరపడుతుంది.

నాటక నిర్మాణంలో ఆదిమధ్యాంతాలను ఎంతో నేర్పుతో నిర్మిస్తాడు ఆమంచర్ల.

''అనంతప్రాంతము-గాఢాంధకారము - నిశ్శబ్ద ప్రకృతి - మందగానము - మరల నిశ్శబ్దము'' అన్న సూచనలతో ప్రారంభమైన నాటకం అవే సూచనలతో అంతం అవుతుంది. అంతేకాదు హిరణ్యకశిపునితో 'ధ్వని' సంభాషించడంతోను, ధ్వని రాజును ''మహాపురుషుడవు'' అని అభినందించడంతోను ప్రారంభమైన నాటకం తుదకు అదేరంగంతో ముగుస్తుంది. కృతయుగంలో సాధించలేని విజయానికి, కలియుగంలో సాధించినందుకు హిరణ్యకశిపుని 'ధ్వని' ప్రశంసిస్తుంది చివరకు.

మతం, దేవుడు మానవుల సృష్టి అని, దానివల్ల హింస ఎక్కువైనదని హిరణ్యకశిపుని మతం. ఇది ఇరువయ్యో శతాబ్దపు శాస్త్ర విజ్ఞానం నేర్పిన క్రాంతి. దానికి ప్రతీకగా హిరణ్యకశిపుని కథను అతి నేర్పుగా మలిచాడు ఆమంచర్ల. ఇందులో గ్రాంధికమే ఎందుకు వాడాడో మాత్రం అర్థం కావడం లేదు. ఇందులో హిరణ్యకశిపుడు ఒక పద్యం కూడా పాడుతాడు! మొత్తానికి పౌరాణిక గాథలకు - ఆధునిక శాస్త్ర విజ్ఞానం ద్వారా నేర్చుకొన్న కొత్త వ్యాఖ్యానం చేయబడిన నాటకాలలో 'ఖూనీ' తరువాత పేర్కొనదగినది 'హిరణ్యకశిపుడు'.

'విశ్వాంతర' ఆమంచర్ల చివరి నాటకం. 1946లో నవోదయలో ప్రచురితం. నాటక రచనలో చేయి తిరిగిన తరువాత యీ నాటకం వ్రాశారని నీలంరాజు వెంకట శేషయ్యగారు అన్నమాటలు నిజం. అజంతా కుడ్యాలలోని విశ్వాంతర చిత్రాన్ని ప్రాతిపదికగా, దాని రచనా కాలాన్ని, ఆ రచనలో జరిగిందని ఊహించుకున్న ఒక సంఘటనను భావయుక్తమైన చక్కని చారిత్రక నాటకంగా వెలయించారు శ్రీ ఆమంచర్ల. తెలుగు నాటక సాహిత్యంలో అటు ప్రదర్శనీయమూ, ఇటు పఠనీయమూ కూడా అయిన కొద్ది ఆధునిక నాటకాలలో 'విశ్వాంతర' ఒకటి.

ఈ నాలుగు రూపకాలలోను నాలుగు భిన్నమైన పోకడలు పోయారు ఆమంచర్ల. కాని వీని అన్నింటికి సాధారణమైన కొన్ని గుణాలున్నాయి. అందులో ముఖ్యమైనది - రచయిత తన కథావస్తువుపై తీసుకొనే శ్రద్ధ. తాను ఏ విషయాన్ని గురించి వ్రాసినా దానిపై నిశితమైన పరిశోధన జరిపే స్వభావం బహుకొద్దిమంది నాటకకర్తలలో ఉంది. అట్టివారిలో ఆమంచర్ల ఒకడు. ఈవిధమైన పరిశోధన అటు ''హిరణ్యకశిపుడు'' లోను, అంతకన్న ఎక్కువగా 'విశ్వాంతర'లోను మనకు కనిపిస్తుంది.

దీనితోపాటు ఒక కొత్తవిషయాన్ని, ఎవ్వరికీ పూర్వం తట్టని దాన్ని కొత్తవిధంగా చెప్పాలన్న ఆతృతకూడా యీయనకు వున్నది. ఆ చెప్పేది తాను నమ్మాలి. దానిని గురించి పూర్వాపరాలను పాఠకుల ముందు ఉంచాలి - నిర్ణయం వారికి వదలాలి. ఇదీ ఆమంచర్ల యీ రచనలలో చూపిన విచక్షణ. ఇందువల్ల వచ్చినదే నూతన వ్యాఖ్యానాలను ఇవ్వాలన్న ఆయన పట్టుదల. ఈ వ్యాఖ్యానాలు - 'హిరణ్యకశిపుడు'లోను, 'విశ్వాంతర'లోను కూడా మతపరంగానే సాగాయి. ఒకదానిలో వైదిక మతంలోని గుడ్డినమ్మకాలను, మరొకదానిలో పతనమైపోతున్న

బౌద్ధమతంలోని నమ్మకాలను వెలికి తీసుకొని వచ్చి దయా, ధర్మాలే లోకకల్యాణానికి మూలమని చాటిచెప్పినాడు అమంచర్ల.

తన నమ్మకాలయెడ అయనకున్న అభినివేశానికి, ఆ అభినివేశాన్ని నాటకాల ద్వారా తర్కబద్ధంగా చూపాలన్న అయిన నిర్భీకమైన ప్రయత్నానికి నాటకాభిమానులందరూ ఆమంచర్లను అభినందించాలి.

కథాస్వీకరణలోను, దాని నిర్వహణలో ఇంతటి 'సిన్సెరిటీ'ని చూపే రచయితలే యీనాడు మనకు కన్పించరు. అట్టి కొద్దిమంది రచయితలలో ఆమంచర్ల ఒకడు - అనడమే అతని ప్రత్యేకతను చాటి చెపుతుంది.

## ఆమంచర్ల వారి విశ్వాంతర

శ్రీ ఆమంచర్ల గోపాలరావు వ్రాసిన నాలుగు రూపకాలలోను ఉత్తమమైనది ''విశ్వాంతర.'' దీని రచనకాలం **1946**. ప్రప్రథమంగా ''నవోదయ'' పత్రికలో ధారావాహికంగా ప్రచురితం. అంతకుముందే గోపాలరావు గారు రెండు నాటికలు - మాటపట్టింపు, మల్లమదేవి ఉసురు- ''హిరణ్యకశిపుడు'' అన్న నాటకం వ్రాసి ధైర్యసాహసాలు గల నాటకకర్తగా పేరుపొందారు. ''హిరణ్యకశిపుడు'' బళ్ళారి రాఘవ ప్రశంసలను పొందడమే కాదు; ఆ నాటకంలో రాఘవ హిరణ్యకశిపుడు వేషం ధరించేవాడు కూడా.

''విశ్వాంతర'' విశిష్టమైన రచన కావడానికి మూలకారణాలు: ఒకటి ఇది రంగస్థలం మీద ప్రదర్శించడానికి ఎంత అనుకూలమో, అంత సాహిత్యపు విలువలు కలిగినది. రెండవది - రచయిత ఈ కథానిర్వహణలో చూపిన నేర్పు. మూడవది కథ స్వీకరణలో రచయిత సాగించిన పరిశోధన. మొదటి కారణం - బహుశః- తరువాతి రెండు కారణాల కలయిక అని చెప్పవచ్చు. ఎందువల్లనంటే రచయిత కథ నిర్వహణలో చూపిన నేర్పును శిల్పమనీ, ఇతివృత్త పరిశోధన కథావస్తువనీ అనుకుంటే యీరెండిట సమగ్రమైన కలయికే మొదటి లక్షణంగా పరిణతి చెందుతుంది.

ముందు కథావస్తువుని గురించి : బుద్ధుడుగా పరిణతినందిన గౌతముడు పూర్వజన్మలో విశ్వాంతరుడు. ఆయన విశ్వామిత్రుడన్న రాజకుమారుడు. విశ్వాంతరుని భార్య మాద్రి. విశ్వాంతరుడు అమిత దానశీలి. అసాధ్యమైన ''దానసారమిత''ను ఆ జన్మలో సాధించిన విశ్వాంతరుడు మరుజన్మలో గౌతముడైనాడు.

విశ్వాంతరుని ''దానసారమిత'' తన భార్యను కూడా దానం చేసేవరకు పోతుంది. తండ్రి రాజ్యంలో ఉండగా విశ్వాంతరుడు, మాద్రి తమ సర్వస్వాన్ని విచక్షణ లేకుండా దానం చేస్తూవుండగా, తండ్రి కోపంతో వారిద్దరినీ -వారి సంతానంతోసహా రాజ్యంలోనుంచి అడవులలోకి తరిమివేస్తాడు. అడవులకు పోయేదారిలోనే విశ్వాంతరుడు తన రథాన్ని, అశ్వాలను, చివరకు తన సంతానాన్ని కూడా దానం చేస్తాడు. తుదకు ఇంద్రుడు బీద బ్రాహ్మణుని వేషంలో వచ్చి 'మాద్రి'ని దానం యివ్వమంటాడు. విశ్వాంతరుడు సంకోచం లేకుండా తన భార్యను దానం చేస్తాడు. ఈ దానశీలానికి ఇంద్రుడు నిశ్చేష్టుడై వారికి దర్శనం ఇచ్చి ధర్మపత్నిని దానం చెయ్యడానికి హక్కులేదని విశ్వాంతరుణ్ణి కోపగించి, మాద్రిని అతనికి తిరిగి అప్పగిస్తాడు. బౌద్ధుల చరిత్రలో 'దానసారమిత'ను సాధించి బోధిసత్వుడైన విశ్వాంతరునికి ఉన్నతమైన స్థానం ఉంది. అంతేకాదు, బౌద్ధవాఙ్మయంలో

విశ్వాంతరుణ్ణి జగన్మోహనుడుగా వర్ణిస్తారు. ఈయన ''జాతకం'' జాతక కథలలో ప్రఖ్యాతం. ఆయన దానశీలతను వర్ణించే ఎన్నో చిత్రాలు సాంచి, అజంతా వంటి శిల్ప క్షేత్రాలలో కన్పిస్తాయి. వీని అన్నింటిలోను అజంతాలోని 17వ గుహలోని చిత్రం అత్యుత్తమమైనది. ఈ చిత్రరచన క్రీస్తుశకం ఆరవ శతాబ్దం అని శిల్ప నిపుణుల అభిప్రాయం. ఆ చిత్రనిర్మాణాన్ని ప్రాతిపదికగా, ఆ చిత్రాన్ని నిర్మించిన చిత్రకారుణ్ణే నాయకుణ్ణిగా గ్రహించి వ్రాయబడిన యీ ఊహాజనితమైన నాటకంలో రచయిత ఎనిమిదో శతాబ్దంలో బౌద్ధమత స్థితిని గురించి వివరంగా వర్ణించారు.

ఎనిమిద శతాబ్దం భారతదేశంలో బౌద్ధమతం అంతరించడానికి ప్రారంభం. బుద్ధుడు క్రీ.పూ. 483లో పరి నిర్వాణం చెందాడు. క్రీస్తుశకం ఒకటి రెండు శతాబ్దాలలో బుద్ధుడు నిషేధించిన విగ్రహారాధన ప్రారంభమై బుద్ధుడు బోధించినది హీన యానమని, నూతన సిద్ధాంతాలతో కూడినదే మహాయానమని ప్రసిద్ధికెక్కాయి. క్రీస్తుశకం 200లోనే బౌద్ధ ఆరామాల్లో అక్కడక్కడ రహస్యంగా ప్రారంభింపబడి, మూడవ శతాబ్దిలో 'గుహ్య సమాజం' రూపంలో ప్రచారమై క్రీ.శ. 500 వచ్చేసరికి దృఢమై 800లో బయటకు వచ్చింది.

వజ్రసమానమైనది కనుక వజ్రయానం అనబడ్డది. ఈ యానం రూపొందంది ఏ బౌద్ధుడూ పరినిర్వాణం సాధించలేడని వజ్రయాన సిద్ధాంతం. దీని ఆచరణకుగాను మంత్రాలు, తంత్రాలు, ధారణిలు, ముద్రలు అన్నవి ముఖ్యమైనవి. ఆమంచర్ల మాటల్లో చెప్పాలంటే -

> ''చివరకు పంచ 'మ' కారాలు, అంటే, మద్యం, మాంసం, మత్స్యం, ముద్ర, మైథునం - లేనిదే సాధన నిష్ఫలం అనే వాదం కూడప్రబలి, వజ్రయాన ఆచారంలో ముఖ్యస్థానం వహించినవి.''

పై మాటలవల్ల ఎనిమిదవ శతాబ్దం వచ్చేసరికి బౌద్ధమతంలోని ప్రాథమిక సూత్రాలకు స్వస్తి చెప్పబడి బౌద్ధదేవతలు, వారికి సంహార రూపాలు, రుద్రరూపాలు కూడా సంక్రమించాయి. ఈ వజ్రయానం ఏడు, ఎనిమిదవ శతాబ్దాలు వచ్చేసరికి వైదిక ధర్మానికి పూర్ణశత్రుత్వం వహించింది. బౌద్ధదేవతలు హిందూ దేవతలను బానిసలను చేయడం, తుదకు కాలిక్రింద మట్టగించడం వంటివి కూడా చూపబడ్డాయి. బౌద్ధుల యీ విపరీతపు చేష్టలే బౌద్ధమతం మనదేశంలో అంతరించడానికి కారణమని గోపాలరావుగారు పేర్కొనడం ఎంతైనా నిజం.

విశ్వాంతరుని చిత్రలేఖనంతోపాటు యీ కథా స్వీకరణలో ఆమంచర్ల 'చారిత్రక వాస్తవికత' (histrorical realism)ను దృష్టిలో వుంచుకొన్నారు. అందుకు అనుగుణంగా కథాకాలంలో కొన్ని మార్పులు చేశారు. ముఖ్యంగా - అజంతా గుహల్లోని విశ్వాంతర చిత్రం అంతకుముందుగానే చిత్రించబడ్డా, బౌద్ధమతం హీనయాన ప్రభావానికిలోనై అంతరించే సమయంలో - అంటే 8వ శతాబ్దంలో - చిత్రించబడ్డట్లు చూపడం మొదటి మార్పు.

ఈ మార్పువల్ల ఆమంచర్ల కథకు గొప్ప నాటకీయ సామ్యాన్ని (dramatic parallel) రూపొందించుకొన్నారు. ఒకవంక స్వార్థంతో కలుషితం అయిన వజ్రయాన వ్యవస్థకు మరొకవంక విశ్వాంతరుని జీవితమే ఆదర్శంగా ఉంచుకొన్న దయాధర్మచిత్తులైన బౌద్ధులకు మధ్యగల అంతరాన్ని యీ నాటకం విస్పష్టంగా చూపించగలిగింది.

వజ్రాచార్యుడైన అగ్నిదత్తుడు తన మంత్రతంత్రాలతో మహాముద్ర యోగం ద్వారా సిద్ధి సంపాదించడానికి ప్రయత్నిస్తాడు. అప్పటికే వజ్రయానం పేరుతో బౌద్ధమతం ఎంత హీనస్థితికి దిగజారిపోయిందో అగ్నిదత్తుని పాత్ర మన కన్నులకు కట్టినట్లు చూపుతుంది. అందుకు విరుద్ధంగా మహానాయకుడు, శాంతమూర్తి అయిన ధర్మగుప్తుడు తనకు వజ్రయాన ధర్మాలు తెలియవని చెబుతూ - ''ఆర్యసత్యాణీ, అష్టశీలాలూ తప్ప వేరే ధర్మం నేనెరుగను'' అంటాడు. ఇలా వారిద్దరూ ప్రతీకలై నిలచిన పరస్పర విరుద్ధములైన భావాలను చిత్రీకరించడానికి రచయిత కాలంలో చేసిన మార్పు ఎంతగానో తోడ్పడ్డది.

ఈ నాటకంలోని మూడు రంగాలూ కూడా విశ్వంతరుడు, అతని భార్య మాద్రి తమ సంతానాన్ని బ్రాహ్మణునకు దానం చేస్తున్న దృశ్యం చిత్రింపబడ్డ గుహలోనే జరుగుతాయి. వెనుక విశ్వంతరుని చిత్రం, అతని దానశీలత - ప్రతినిత్యమూ యీనాటి బౌద్ధుల స్వార్థజీవితాన్ని వెక్కిరిస్తున్నట్లు, ఆనాటికి యీనాటికి గల అంతరాన్ని చూపుతున్నట్లు తోస్తుంది. చిత్రం అంతా పూర్తి అయింది. కాని తిలకరచన పూర్తికాలేదు. ఈ నాటకంలో విజయశ్రీ తన బొటనవ్రేలి రక్తంతో ఆ తిలకరచనను పూర్తికావించాడు. కాని అసలు చిత్రంలో అట్టి తిలకశోభ ఆనాటికి యీనాటికి కూడా పూర్తిచేయబడలేదు.

ఈ నాటకంలో వచ్చే పాత్రలన్నీ కూడా తరతరాల భారతీయ జీవన విధానాన్నిబట్టి చూస్తే రెండు ముఖ్యమైన పద్ధతుల మీద నిర్మించబడ్డాయి. ఒకరు సత్యము, ధర్మము, దయ - అన్న సర్వసాధారణము, ప్రాథమికము అయిన భావాలకు ప్రతీకలు. రెండవ తరగతివారు తంత్రమంత్రాలు, సిద్ధులు- వీటివలన ప్రతిభాన్వితులైనవారు; అధికార వాంఛామతులు. ఎప్పుడైతే యీ మంత్రతంత్రాలు ఒకే వ్యక్తి తన స్వప్రయోజనాలకు ఉపయోగిస్తాడో, ఎప్పుడు ఆ మంత్రతంత్రాలు పరిశుద్ధతను విడనాడి సామాన్య మానవులందరూ ఆమోదించే నీతి నియమాలను అధిగమించడానికి ప్రయత్నిస్తాయో, అప్పుడు అంతటి సిద్ధులు కూడా ప్రజాశక్తుల ముందు పరాజయాన్ని అంగీకరించక తప్పదు. ఈవిధమైన సంఘర్షణ ఒక్క బౌద్ధమంతలోనే రాలేదు. ముందు హిందూమతంలో యిట్టి స్థితి ఉన్నప్పుడే బౌద్ధమతం వృద్ధికావడానికి ఆస్కారం కలిగింది. ఆతరువాత బౌద్ధమతం, తిరిగి హిందూమతం - యివి అన్నీ ముందు పరిశుద్ధంగా, సర్వజనుల సౌభాగ్యాన్ని ఆకాంక్షించి ప్రారంభమైనా, రానురాను కొందరు వ్యక్తుల స్వార్థకాంక్ష బలీయమై సాంఘికకల్యాణం ఆ కొద్దిమంది వ్యక్తుల కల్యాణంగా చెలామణీ కావడం మనం ప్రతి తరంలోనూ చూస్తున్న విషయమే! ఈ సార్వజనీనము, సార్వకాలికము అయిన విషయాన్ని బౌద్ధమతపరంగా చూపారు ఈ నాటకంలో ఆమంచర్ల.

పాత్రలలో పైన పేర్కొన్న రెండు విభిన్న భావాలకు ప్రతీకలుగా విహార మహానాయకుడు ధర్మదేవుని, వజ్రాచార్యుడైన అగ్నిదత్తుని పేర్కొనవచ్చును. ఒకరు పరమ శాంతమూర్తి. మరొకరు నిరంతరం కోపతాపాలను కక్కే అగ్నిమూర్తి. ఈ నాటకంలోని నాయకుడు విజయశ్రీ. వీరిరువురికీ మధ్యస్తంగా నిలపదగినవాడు. అతని ''వదనంలో శాంతం గంభీరం ప్రతిఫలిస్తాయి.'' తన భావాలలో ధర్మదేవునివలెనే ఆర్య సత్యాణిని, అష్టశీలాలను మాత్రమే నమ్మినవాడు. కాని పట్టుదలలో, తన చుట్టూవున్న వారియెడ ఎట్టి దౌష్ట్యమూ సహించలేని అతని ధర్మకోపంలో అతడు కొంత అగ్నిదత్తునిలోని ఆ కోపభావాన్ని పుణికిపుచ్చుకున్నట్లు తోస్తుంది. అయితే ఒకటే భేదం : అగ్నిదత్తుని కోపం అధర్మయుతమూ, యుక్తాయుక్త విచక్షణా రహితమూ అయిన కోపం. విజయశ్రీకి

...ధర్మం, నియతి త్యజింపబడ్డప్పుడే వస్తుంది. తన ప్రేయసి యశోదను అగ్నిదత్తుడు మహాముద్రకోసం ...వంతం చేసినప్పుడు, తన మిత్రుడు దేవగుప్తుణ్ణి ఎవరో బలంగా కొట్టినప్పుడు అతనిలో కనిపించే కోపం, ...భావం - అతనిలోని 'యువత'ను స్ఫురింపచేస్తాయి. అంతేకాదు. అధర్మానికి ప్రతీకారం చేయక తప్పదన్న అతని నిశ్చయాన్ని కూడా తెలియచేస్తాయి. అగ్నిదత్తుని గుహనుంచి యశోదను విడిపించి తెచ్చినప్పుడు యశోద, ...ప్తుల అభిప్రాయాలు యీ విషయాన్ని విస్పష్టం చేస్తాయి:

యశోద : విజయశ్రీ! నీవింత శూరుడవని నేననుకోలేదు. అగ్నిదత్తుని గుహలో అగ్నిహోత్రుడిలాగ ప్రజ్వలించావు.

దేవ : విజయశ్రీ చిత్తం అగాధం, శౌర్యం, శాంతం, దానం, కరుణ అన్నీ అతనిలో ఇమిడి ఉన్నాయి.

కాని ఇంత శౌర్యమూర్తి అయిన విజయశ్రీ కూడా ప్రశాంతమైన స్థితిలో తాను చూపిన యీ శౌర్యప్రతాపాలను ప్రస్తావించి అన్నమాటలు యీ నాటకానికి, అతని పాత్రకు కూడా వర్తిస్తాయి :

''ప్రకృతి ధర్మమే అది. శాంతంలో జయం, జయంలో శాంతి. హృదయం క్రోధపూరితమై ఉడికి పొగలొచ్చి మైమరచి, మహాసంగ్రామాలు సల్పుతాడు మానవుడు. అంతులేని క్షయం అవుతుంది. కాని చివరలో శాంతోదయం కానిది, సంగ్రామం ఆగదు. జయం అబ్బదు. ఈ నీతి గుర్తెరగడమే జ్ఞానం. జ్ఞానం ఎరిగి ఆదినుంచి శాంతం వహించువాడే బోధిసత్వుడు.''

ఈ పాత్రలను సృష్టించడంలో ఆమంచర్ల ఎంతో వైవిధ్యం చూపారు. అందరూ బౌద్ధభిక్షువులే - అయినా ఎంత వ్యత్యాసం! ఈ భిన్నత్వం - వారు ఆ మతం వెనుక, సాధారణమైన మానవులేనని చాటి చెబుతుంది. వారిలో ధర్మదేవుని వంటి శాంతమూర్తి, విజయశ్రీ వంటి శౌర్యశాంతాలు కలిగినవాడు, అగ్నిదత్తుని వంటి కోపిష్టి మాత్రమేకాక అతి సాధారణులు కూడా వున్నారు. దేవగుప్తుని వంటి భయస్థుడు, శూన్యతార్థ వంటి ప్రమోద్వేగాలు చూపే భిక్షుకి - వీరికీ యీ సంఘంలో తావున్నది. ఈ లక్షణాలు కల మనుషులు అప్పుడు, ఇప్పుడూ, ఎప్పుడూ వుంటారు. అందువల్లనే శ్రీ నీలంరాజు వెంకట శేషయ్యగారన్నట్లు ''వివిధ కాలాల్లోని వివిధ మనస్థితులు 'విశ్వంతర'లో ప్రదర్శించబడ్డాయి.''

రంగ విభజనలో శ్రీ ఆమంచర్ల చూపిన ప్రతీక భావన విస్పష్టం. ఇట్టి ప్రతీకను 'హిరణ్యకశిపుడు'లో కూడా వారు చూపించే ప్రయత్నం చేశారు. ఈ నాటకంలో మొదటి అంకంలోని కథ జరిగిన సమయం ప్రాతఃకాలము, ద్వితీయాంకము మధ్యాహ్నం, తృతీయాంకం సూర్యాస్తమయం - లోను జరిగినట్లు చూపారు రచయిత. కథా నిర్మాణం యొక్క ప్రగతిని చూపడం కాక యిది ఒక ప్రధానమైన విషయాన్ని చూపుతున్నది. ఈ ఆది, మధ్య, అంతాలు కాలాన్ని సూచించడమే కాక భారతదేశంలోని బౌద్ధమత అంకురాన్ని, వ్యాప్తిని, అంతాన్ని కూడా పరోక్షంగా ధ్వనింపచేస్తున్నాయి. ధర్మదేవుల ఆదరణ, విజయశ్రీ చిత్రరచన బౌద్ధమతంలోని ఆది ధర్మాన్ని, అగ్నిదత్తుల ఆగ్రహం, విజయశ్రీతో ఆయన వైమనస్యం బౌద్ధమతంలోని సంఘర్షణను, అగ్నిదత్తుల పరాజయం వజ్రయానాత్మకమైన బౌద్ధధర్మ పరాజయం కూడా.

ఈ రంగ విభజనతో ఏ వాతావరణాన్ని నిర్మించాలని రచయిత ఆశించారో అట్టి వాతావరణాన్నే అనేకములైన యితర పద్ధతుల ద్వారా కూడా సాధించారు ఆమంచర్ల. ఉదాహరణకు మూడవ అంకంలోని

తుపాను. బయట పెద్ద తుపాను. బౌద్ధ ఆరామాల్లో అధికారం కోసం పోట్లాట. విజయశ్రీ అన్నట్లు - తుపాను కాదు తుపానులు. గ్రామంలో తుపాను, ఆరామంలో తుపాను. విశ్వమంతా తుపాను!

వాతావరణ నిర్మాణం కోసం ఆమంచర్ల పాత్రల నిర్మాణాన్ని, వారి సంభాషణలను, విశ్వంతర చిత్రం వెనకగా వున్న గుహను - అన్నింటిని కూర్చారు. అలాగే - యీ కేవల వాతావరణ నిర్మాణం - వెనుక ఒక సార్వజనీనమైన సత్యాన్ని చెప్పాలన్న ఆకాంక్ష కల, ఉపదేశాత్మక దృష్టికల రచయిత **(purposive dramatist)** ఆమంచర్ల. ఈ విషయం అడుగడుగునా ప్రత్యక్షంగాను, పరోక్షంగాను కూడా వ్యక్తం అవుతుంది.

ఒక్క ఉదాహరణ. మూడవ అంకంలో - తుపాను భయంకరంగా వున్నప్పుడు ఒకప్రక్క ఆరామ వినాశానికి గ్రామస్థులు వస్తున్నారన్న వార్త. వేరొకప్రక్క అగ్నిదత్తుడు నట్టెజరిపించి ధర్మదేవుల నుంచి అధికారాన్ని తానే హస్తగతం చేసుకుంటాడన్న వార్త - వినవస్తాయి. నిజానికి యీ రెండూ బౌద్ధమత క్షేమానికి, అస్తిత్వానికి వినాశహేతువులే! చిట్టచివరకు బౌద్ధమత వినాశనానికి అంతశ్శత్రువులే కారకులైనారు. నట్టె జరిపించేచోట పోట్లాట పెచ్చుపెరిగి అనేకులు హతులౌతారు - ఇక్కడ ఆమంచర్ల - అన్నిమతాలు నాశనమయ్యేది బాహ్య సంఘర్షణ వల్ల కాదు, అంతఃసంఘర్షణ వల్లనేనన్న సత్యాన్ని మనముందు ఉంచారు.

ఇలా అటు సాహిత్యదృష్టితో చూచినా, ఇటు రంగస్థల ప్రదర్శన దృష్టితో చూచినా కూడా మంచి నాటకం విశ్వంతర. శ్రీ కూర్మా వేణుగోపాలస్వామి గారన్నట్లు ''ఆమంచర్ల గోపాలరావు రచన విస్తృతిలో కొద్దియైనా, గాఢమయిన పరిశోధనకు ఫలస్వరూపం.'' అందుకు నిదర్శనం విశ్వంతర.